సాక్షి కర్నూలు

బుధవారం : 30 : అక్టోబర్ : 2024



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ ఆవరణలోని శనగల బసవన్నకు మంగళవారం శాస్త్రోక్తకంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యంగా నానపెట్టిన శనగలను సమర్పించారు.



తగ్గిన టమాట ధర

తుగ్గలి: పత్తికొండ మార్కెట్‌యార్డుకు మంగళవారం 836 క్వింటాళ్ల టమాట విక్రయానికి రాగా కిలో గరిష్టంగా రూ.30 పలికింది. కనిష్టంగా రూ.15 చొప్పున కొనుగోళ్లు జరిగాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 15,626
అవుట్ ఫ్లో	: 15,386

న్యూస్‌రీల్

బీఈడీ ఫెయిలైన వారికి మరో అవకాశం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సుల్లో ఫెయిలైన విద్యార్థులకు స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు 2015, 2016, 2017, 2018, 2019 సంవత్సరాల్లో చేరి కోర్సు పూర్తి చేసుకోలేని వారి కోసం స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. నవంబర్ 11వ తేదీలోగా ఆయా కళాశాలల్లో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

సాగునీటిని అందించడంలో వైఫల్యం



కొత్తపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న రామకృష్ణ

పత్తికొండ(తుగ్గలి): జిల్లా రైతులకు సాగు, తాగు నీరు అందిచడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం తుగ్గలి మండలంలోని జొన్నగిరి చెరువు, పత్తికొండ మండలంలోని కొత్తపల్లి వద్ద నిర్మించిన హంద్రీనీవా రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాల్లో అత్యంత కరువు పీడిత మండలాలు ఏవైతే ఉన్నాయో ఆ మండలాలకు తాగునీరు, సాగునీరు అందించే ఏకైక ప్రాజెక్టు హంద్రీనీవానేన్నారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి వందల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందని, ఇక్కడ మాత్రం ఒక్క గ్రామానికి కూడా తాగునీరు ఇవ్వడానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఫస్ట్‌ఫేజ్‌లో కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకు పూర్తిగా నీళ్లిచ్చి ఆతర్వాత అనంతపురం జిల్లా, అందరికీ ఇచ్చుకుంటూ పోతే బాగుంటుందన్నారు. హంద్రీనీవా రిజర్వాయర్, కాలువలకు రూ.245 కోట్లు నిధులు కావాలని ముఖ్యమంత్రిని సంబంధిత మంత్రులను త్వరలో కలుస్తామని చెప్పారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, డి.జగదీష్, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై ఆకస్మికంగా రాత్రిపూట తనిఖీలు నిర్వహించి వైద్యులు, ఉద్యోగుల్లో బాధ్యతలు గుర్తు చేస్తామన్నారు. అనంతరం ఆయనను మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, డాక్టర్ సి. ప్రభాకరరెడ్డి, మెడికల్ కాలేజి ఏడీ అనిల్‌కుమార్ రెడ్డి, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. సాయంత్రం ఆయన క్యాజువాలిటీ, ఏఎంసీలను తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): రేషన్‌కార్డుదారులకు ఇచ్చే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లకు సంబంధించి మొదటి సిలిండర్ బుకింగ్ మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు జేసీ నవ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీపై జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదాయ పన్ను చెల్లించే వారు, 1000 చదరపు అడుగుల స్థలం/ఇళ్లు ఉన్న వారు, నాలుగుచక్రాల మోటారు వాహనాలు ఉన్న వారు, 300 యూనిట్ల కరెంట్ బిల్లువచ్చే వారు, మూడు ఎకరాల తడి పొలం లేదా 10 ఎకరాల మెట్ట పొలం ఉన్న అనర్హులని చెప్పారు. కాగా, ప్రస్తుతం రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ యాక్టివ్‌గా ఉన్న వారికి మాత్రమే ఉచిత గ్యాస్‌పథకం వర్తిసుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రాజారఘువీర్‌పాల్గొన్నారు.

నాలుగు రోజుల అనుమతి

కర్నూలు(సెంట్రల్): దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాల్లో అమ్మకాలకు ప్రభుత్వం నాలుగు రోజులపాటు అనుమతి ఇచ్చింది. ఈనెల 29, 30, 31తో పాటు నవంబర్ 1వ తేదీ వరకు వ్యాపారాలు అమ్మకాలు చేసుకోవచ్చు. కాగా, జిల్లా వ్యాప్తంగా 119 షాపులకు అనుమతులు ఇవ్వగా అందులో కర్నూలులో 100, సిబెళగల్‌లో 2, కోడుమూరులో 4, ఆదోనిలో 9, పత్తికొండలో 4 దుకాణాలకు అనుమతులు ఇచ్చారు.

కరువును దాచేశారు!

మొలకెత్తని విత్తనం నిలదీస్తోంది.. గిడసబారి ఎండిన మొక్కలు ఏకరువు పెడుతున్నాయి.. నీళ్లలో కుళ్లిన పంటలు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి.. తడిచిన ధాన్యం గింజలు ఇదేమి పరిస్థితి అంటూ ప్రశ్నిస్తున్నాయి. కోటి ఆశలతో ఖరీఫ్‌లో సాగు మొదలు పెట్టిన రైతులు ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావంతో పంటలు దున్నేసి మళ్లీ విత్తనం వేశారు. దిగుబడి చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయారు. అయినా జిల్లాలో కరువు ప్రభావం పెద్దగా లేదంటూ ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు కరువును దాచేశారు. కేవలం రెండు మండలాల్లోనే కరువు ఉన్నట్లు ప్రకటన విడుదల కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అధిక వర్షాలు, వర్షాభావంతో కలసిరాని ఖరీఫ్
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- పెరుగుతున్న వలసలు, తగ్గిన భూగర్భ జలాలు
- అయినా.. జిల్లాలో కరువు లేదంట..
- కరువు జాబితాలో రెండు మండలాలకే చోటు



వర్షాలు లేక చిప్పగిరి మండలం నేమకల్లు సమీపంలో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణ పరిస్థితులు కలసి రాకపోవడంతో కర్నూలు జిల్లాలో ప్రధాన పంటల సాగు గణనీయంగా పడిపోయింది. వర్షాభావానికి తోడు అధిక వర్షాలు ఉండటంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. అంతంతమాత్రం వచ్చిన దిగుబడులకు కూడా గిట్టుబాటు ధరలు లభించక రైతులు నష్టాలు మూటకట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా గుర్తించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కరువును దాచేసి రైతుల కడుపు కొడుతోంది. జిల్లాలో కేవలం పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లోనే కరువు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటన జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాభావం, అధిక వర్షాల ప్రభావం జిల్లాలోని అన్ని మండలాలపై తీవ్రంగా ఉంది. వీటిని జిల్లా యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోకుండా కేవలం పశ్చిమ ప్రాంతంలోని కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో కరువు మధ్యస్థంగా ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపింది. వాస్తవానికి పశ్చిమ ప్రాంతం మొత్తంగా కరువు పరిస్థితులు ఉన్నాయి. కానీ జిల్లా యంత్రాంగం మాత్రం కరువును కేవలం రెండు మండలాలకే పరిమితం చేయడం గమనార్హం. జిల్లా యంత్రాంగం పంపిన నివేదిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆ రెండు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తిస్తూ మంగళవారం జీవో విడుదల చేసింది. బాబు.. కరువు కవల పిల్లలనేది మళ్లీ ప్రజల్లో చర్చకు వస్తుందనే కారణంతోనే జిల్లాలో కరువును దాచేశారేమోనని ప్రజలు విమర్శిస్తున్నారు.

పడిపోయిన ప్రధాన పంటల సాగు..

జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రధానంగా వాణిజ్య పంటగా పత్తి సాగు చేస్తారు. ఈ సారి మాత్రం ఈ పంట సాగు తగ్గి పోయింది. సాధారణ సాగు 2,43689 హెక్టార్లు కాగా కేవలం 1,92,389 హెక్టార్లకే పరిమితమైంది. అలాగే వేరుశనగ సాధారణ సాగు 58,969 హెక్టార్లు కాగా 43,333 హెక్టార్లలోనే సాగు అయింది. 2023 ఖరీఫ్‌లో కూరగాయల పంటలు 11,868 ఎకరాల్లో సాగు కాగా ఈ ఏడాది కేవలం 6,976 ఎకరాలకే పరిమితమైంది. సాగు తగ్గిపోవడం కరువు తీవ్రతకు అద్దం పడుతున్నాయి. జిల్లా యంత్రాంగం మాత్రం కరువు తీవ్రతను తగ్గించి కేవలం రెండు మండలాలకే పరిమితం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఖరీఫ్‌లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం (మి.మీ)
జూన్	77.7	140.4
జూలై	90.7	58.2
ఆగస్టు	116.2	200.1
సెప్టెంబర్	116.5	97.6

లోలోపలికి భూగర్భ జలాలు....

కరువు మండలాలను గుర్తించడంలో భూగర్భ జలాలు కీలకం. ప్రస్తుతం కోసిగి మండలం వందగల్లులో సెప్టెంబరు నెలలో భూగర్భ జలాలు 36.65 మీటర్లలో ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు అట్టడుగుకు వెళ్లాయి. ఆదోని మండలం బైచిగేరిలో 19.87 మీటర్లు, ఆస్పరి మండలం అరికేర గ్రామంలో 20.22 మీటర్లు, గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలో 22.27 మీటర్లు, పత్తికొండ మండలం దేవనబండ గ్రామంలో 17.05 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నా అధికారులు లెక్కలోకి తీసుకోలేదు.

నష్టం కనిపిస్తున్నా.. కరుణ ఏదీ ?

ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబరు నెల వరకు ఉంటుంది. కరువు ప్రాంతాలను గుర్తించాలంటే ఈ నెలల్లో నమోదైన వర్షపాతం వివరాలను పరిగణలోకి తీసుకుంటారు. జూన్, ఆగస్టు నెలల్లో అధిక వర్షాలు కురిశాయి. జూలై, సెప్టెంబరు నెలల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ మొత్తంగా అన్ని మండలాల్లోనే నాలుగు నెలల్లో నమోదైన వర్షపాతం వివరాలను పరిశీలించినా పలు మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది. అధిక వర్షాలతో జిల్లాలో 16,235 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అధిక వర్షాలు పత్తిపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. పత్తి కాయలు పగలటానికి సిద్ధమవుతున్న సమయంలో అధిక వర్షాలతో కాయలు కుళ్లి పోయాయి. దీంతో 30 నుంచి 40 శాతం దిగుబడులు పడిపోయాయి. జూలై, సెప్టెంబరు నెలల్లో వర్షాలు లేకపోవడంతో 33 శాతం పైగా పంటలు దెబ్బతిన్నాయి. అయితే కరువుపై జిల్లా యంత్రాంగం కరుణ చూపకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.



కౌతాళం మండలంలో భారీ వర్షానికి నీట మునిగిన పత్తి పంట



ఊళ్లు ఖాళీ అవుతున్నాయి..

జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు పెద్దగా లేకపోవడంతో ఉపాధి కరువై 15 రోజుల క్రితం నుంచే వలసలు మొదలయ్యాయి. కోసిగి, ఆదోని, పెద్దకడబూరు, కౌతాళం, హాలహర్వి, హొళగుంద, మద్దికెర, దేవనకొండ మండలాల నుంచి వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులు వలసబాట పట్టారు. ఇప్పటికే జిల్లా నుంచి 20 వేల కుటుంబాలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో వలసలు మరింత పెరిగే అవకాశం ఉంది. పశ్చిమ ప్రాంతం ప్రధానంగా వర్షాధారం మీద ఆధారపడింది. అనావృష్టి, అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్ పూర్తి కావడంతో పనులు కరువు అయ్యాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలసలు పెరుగుతున్నాయి. జిల్లా నుంచి పెద్ద ఎత్తున వలసలు సాగుతుండటం కరువుకు నిదర్శనంగా కనిపిస్తోంది.

కరువు జిల్లాగా ప్రకటించాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు కలసి రాలేదు. ఒక వైపు వర్షాభావం, మరోవైపు అధిక వర్షాలు వ్యవసాయాన్ని దెబ్బతీశాయి. నీటి వసతి కింద సాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ వర్షాధారం కింద పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రధానంగా పశ్చిమ ప్రాంతం మొత్తంగా కరువు పరిస్థితులు ఉన్నాయి. కరువు ఉన్నందునే బతుకుతెరువు కోసం ప్రజలు వలస వెలుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాను కరువు ప్రాంతంగా గుర్తించి రైతులను ఆదుకోవాలి.

– జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

మా మండలం మొత్తం కరువే



మాకు 3 ఎకరాల భూమి ఉంది. ఇందులో పత్తి సాగు చేశాం. రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. భారీ వర్షాలకు ఎకరాకు 4 క్వింటాళ్ల పత్తి కూడా రాలేదు. ఈ పరిస్థితి నా ఒక్కరిదే కాదు. కోసిగి మండలం మొత్తంగా ఇదే పరిస్థితి ఉంది. 15 రోజులుగా వలసలు సాగుతున్నాయి. కరువు లేకపోతే ప్రజలు వలస ఎందుకు పోతారు.

– కే.రాముడు, సీపీఎం మండల కన్వీనర్, కోసిగి

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- జిల్లాలో 20,59,700 మంది ఓటర్లు
- ఆర్నెల్లలో పెరిగిన వారు 5,176

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ సమ్మరీ రివిజన్–2025కు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య 20,59,700. ఇందులో పురుషులు 10,16,134 మంది, స్త్రీలు 10,43,254 మంది, ఇతరులు 312 మంది ఉన్నారు. కాగా జిల్లాలో పురుషుల కంటే 27,120 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కాగా, ఎన్నికల ముందు ఏప్రిల్ 25వ తేదీన విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలో 20,54,524 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఆరు నెలల కాలంలో 5,176 మంది ఓటర్లు పెరిగారు.

అభ్యంతరాల స్వీకరణకు 28 వరకు గడువు

ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీలు, ఓటర్లకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారు. కొత్తగా ఓటరు నమోదు, తొలగింపు, పేర్లు, ఇతర అంశాలపై ఎడిట్ ఆప్షన్ కోసం కూడా అర్జీలు ఇస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.

డబ్బులిస్తే ఉద్యోగాలు రావు

- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (టౌన్): డబ్బులిస్తే ఉద్యోగాలు రావని, పోటీ పరీక్షలు, ప్రతిభ ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు మాత్రమే వస్తాయని ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ జాబ్స్, బ్యాంకుల్లో ఉద్యోగాలు, సచివాలయ ఉద్యోగాలు, హోంగార్డ్ ఉద్యోగాలు, ఫుడ్ కార్పొరేషన్ ఉద్యోగాలు అంటూ మధ్య దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. అమాయకులనే లక్ష్యంగా ఎంచుకుని ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దళారులు మోసాలకు పాల్పడుతున్నట్లు హెచ్చరించారు. ఎక్కడైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారి గురించిన సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(సెంట్రల్): మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మత్తు పదార్థాల రవాణాపై నిఘా వేసి ఉంచాలన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో నిత్యం గస్తీ నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంతోకలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ.. 2019 నుంచి ఇప్పటి వరకు 96 మత్తు పదార్థాల రవాణా కేసులు నమోదైనట్లు చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మత్తు పదార్థాల నివారణకు తీసుకున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, డీఎస్పీ రాజశేఖర్, మునిసిపల్‌కమిషనర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

మోత మోగనీయకు.. పొగ రానీయకు!

- రేపు దీపావళి పర్వదినం
- పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం
- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- అధిక శబ్దాలు, పొగ వచ్చే బాణాసంచా వద్దు



కర్నూలు కల్చరల్: దీపావళి పర్వదినం రోజు ఇంటింటా దీప కాంతులతో పాటు మోత మోగించే, పొగలు విరజిమ్మే టపాసులు పేల్చడం అంతటా కనిపిస్తోంది. జీవితంలో కష్టాలను చీకటితో పోల్చి విజయాల వెలుగులు అందరికి దక్కాలన్నది ఈ పండుగ అందించే సందేశం. అయితే టపాసులు సాధ్యమైనంత తక్కువగా జాగ్రత్తగా కాల్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ టపాసులను వినియోగించాలని పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా వెదజల్లాలంటే జాగ్రత్తలు తప్పని సరి. ఎలాంటి అపశ్రుతి చోటు చేసుకోకుండా ప్రకృతికి మేలు చేసేలా సంతోషంగా ఈ దీపావళిని జరుపుకుందాం. సుప్రీంకోర్టు సైతం బాణాసంచా వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై సమాజంలో చైతన్యం తీసుకురావల్సిందిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో టపాసుల్ని కాల్చరాదు. తక్కువ కాలుష్యం, శబ్దం వచ్చే టపాసులను కాల్చడం సమాజ హితమని పేర్కొంది. బాణా సంచా తయారు చేయాలంటే రసాయనాల్ని వాడాల్సిందే. టపాసులను పేల్చినప్పుడు వాటి నుంచే వెలువడే పొగను పీల్చితే అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. టపాసుల అధిక శబ్దం వల్ల శాశ్వత వినికిడి లోపం, రక్తపోటు గుండె జబ్బులు నిద్రలేమి రోగ నిరోధకశక్తి తగ్గడం, పుట్టుక లోపాలు తదితర సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ఒత్తిడికి దారి తీస్తుంది. మతిస్థిమితం కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. పండుగుల సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకోవాలని, బాణా సంచా కాల్చడం తప్పుకాదని, అయితే ఇతరకు ఇబ్బందులు, ప్రకృతికి హాని కలగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని పర్యావరణ హితులు చెబుతున్నారు.



కర్నూలు ఎస్టీబీసీ మైదానంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు

ఆరోగ్యానికి కలిగే ముప్పు ఇలా..

అధిక శబ్దం, భారీగా పొగ వచ్చే టపాసుల్ని కాల్చినప్పుడు అందులోని రసాయనాలు మండి విషపూరిత వాయువులు విడుదల అవుతాయి. వాటిని పీల్చితే చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు.

రసాయనం	సమస్య
కాపర్	చిరాకు కలుగుతుంది
కాడ్మియం	రక్తప్రసరణలో ఇబ్బంది ఏర్పడుతుంది
సీసం	నరాల వ్యవస్థపై ప్రభావం
మెగ్నీషియం	మానసిక స్థిమితం కోల్పోయే ప్రమాదం
జింక్	జ్వరం, వాంతులు
సోడియం, బేరియం	కాలడం (బర్న్స్)

ప్రమిదలను వెలిగిద్దాం..

దీపావళి కాల్చే బాణాసంచా కొందరికి ఇబ్బందిగా పరిణమిస్తోంది. ఇకనైనా వీటికి దూరంగా ఉండి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచడం, ఇంటికి కాంతులు వెదజల్లేలా విద్యుత్ బల్బులతో అలంకరణ చేసుకోవడం. వివిధ ఆకృతుల్లో ఉండే ప్రమిదల్ని వెలిగించాలి. ఒక వేళ పిల్లలు మారాం చేస్తే వారికి వీటిని కాల్చడం వల్ల కలిగే ఇబ్బందుల్ని వివరించి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాలి.

ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్‌ను వినియోగిద్దాం..

రంగులు విరజిమ్ముతూ పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అందరినీ ఆకట్టుకునే పటాకులు లేకుండా దీపావళి పండుగ పూర్తి కాదనుకుంటారు. అలాంటి వారి కోసమే ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. కాన్ ఫెట్టీ, ఫ్లవర్ పవర్, ఫేక్ నోట్, బర్స్ట్, స్నేక్‌మిక్స్ లాంటి పేర్లతో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవి మామూలు బాణా సంచాలా వాతావరణానికి పెద్దగా హాని కలిగించవు. వీటి ధ్వని పరిమిత దూరం వరకే ఉంటుంది. కాలుష్యం కలిగించని రంగురంగుల మెరుపులను వెదజల్లుతాయి. కేవలం గన్ పౌడర్, ఫాస్ఫేట్‌ను మాత్రమే ఉపయోగించి ఆధునిక టెక్నాలజీతో ఈ వెరైటీ బాణాసంచాను తయారు చేస్తున్నారు.

వాయు కాలుష్యాన్ని తగ్గించుకోవాలి

దీపావళి బాణా సంచా కాల్చటంతో వెలువడే రసాయనాలు ప్రధానంగా నైట్రోజన్, కార్బన్, సల్ఫర్‌డైయాక్సైడ్ గాలిలోచేరి తీవ్ర వాయు కాలుష్యానికి కారకాలు అవుతున్నాయి. వీటిని పీలిస్తే ఊపిరితిత్తులలోకి చేరి శ్వాస కోస సంబంధిత వ్యాధులు వస్తాయి. గాలి నాణ్యత సూచి 0 నుంచి 100 వరకు ఉంటే అది ఆరోగ్యకరమైన వాతావరణంగా పరిగణిస్తారు. దీపావళి బాణా సంచా కాల్చిన తరవాత నాణ్యత సూచి 300 వరకు చేరుకోవడంతో ప్రమాదాల బారిన పడే పరిస్థితి వస్తోంది. దీన్ని నివారించాల్సిన అవసరం ఉంది. – బి.రామిరెడ్డి, స్కూల్ అసిస్టెంట్, కోట జెడ్పీహెచ్‌ఎస్, నందికొట్కూరు.

ఆదమరిస్తే ప్రమాదాలు తప్పవు

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదం తప్పదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు, గడ్డివాములు ఉండేవాళ్లు ముందుగా వాటిని నీటితో తడపటం, నీటిని సేకరించి సమీపంలో ఉంచుకోవడం మేలు. అలాగే క్రాకర్స్ విక్రయించే వారు కూడా సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపక శాఖ వారికి, 99637 37924 నెంబర్‌కు సమాచారం అందించాలి. – వై.చిన్న బజారి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, కర్నూలు

ఎన్యుమరేటర్లతో నైపుణ్య సర్వే

కర్నూలు(అర్బన్): నవంబర్ 2వ వారంలో జిల్లాలో ఎన్యుమరేటర్ల ద్వారా స్కిల్ సెన్సెస్ సర్వే ప్రారంభం కానున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి పీ దీప్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సర్వేకు సంబంధించి మంగళవారం స్థానిక సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కిల్ సెన్సెస్ సర్వేకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా, డీఎస్‌డీఓ, డీఈఓలు కోఆర్డినేటర్లుగా, మండల పరిధిలో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని సచివాలయ జనవాసాలను క్లస్టర్‌గా విభజించడం జరుగుతుందన్నారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించి వారి ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ ద్వారా నిర్దిష్ట కుటుంబాల మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల సుగ్గి బాట

పిన్ని ఇంట్లో ఉండి బడికి..



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు పల్లవి. కోసిగి హిందూ బాలికల స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. కొద్ది కాలం క్రితమే తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. తల్లి చిట్టెమ్మ, ఇద్దరు అన్నలు అనిల్‌కుమార్, తిరుమల ఉన్నారు. పేదరికంతో కుటుంబం గడవడం కష్టమైపోయింది. తప్పని పరిస్థితుల్లో తల్లి చిట్టెమ్మ, ఐదు, ఎనిమిదో తరగతి చదివే ఇద్దరు పిల్లలతో కర్ణాటకకు వలస వెళ్లారు. చిన్నారిని పిన్ని వద్ద వదిలిపెట్టి వెళ్లడంతో ఇక్కడే ఉంటూ రోజూ బడికి వెళుతోంది.

- ఇళ్లకు తాళాలు.. బోసిపోయిన వీధులు
- ఖాళీ అవుతున్న గ్రామాలు
- పిల్లలను వెంట తీసుకెళ్లడంతో పాఠశాలల్లో తగ్గిన హాజరు శాతం
- ఉపాధి కల్పించని ప్రభుత్వ యంత్రాంగం

కోసిగి: కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో బతుకుదెరువు కోసం కూలీలు వలస బాట పడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిసిపోయాయి. స్థానికంగా పనులు లేకపోవడంతో పనులు లభించే కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు మూట ముల్లె సర్దుకుని పిల్లాపాపలతో కలిసి ఇళ్లకు తాళాలు వేసి తరలి వెళ్లారు. మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలంలోని వివిధ గ్రామాలు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు గ్రామీణ ప్రాంతాలు, ఆదోని నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి వలస బాట పట్టారు. గత పదిహేను రోజులుగా పనుల కోసం ఇతర ప్రాంతాలకు వాహనాల్లో తరలి వెళుతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఇప్పటివరకు 500కు పైగా లారీలు, టెంపోలు, ట్రాక్టర్లలో 8 వేల నుంచి 10 వేల మంది దాకా తరలి వెళ్లారు. ఎమ్మిగనూరు పరిధిలోని 8 వేల మంది, ఆదోని పరిధిలోని 6 వేలకు పైగా తరలి వెళ్లిపోయారు.



కోసిగిలో నిర్మానుష్యంగా మారిన నాగన్న గేరి కాలనీ

తరలివెళ్లిన గ్రామాలు

ప్రధానంగా కోసిగి మండలం నుంచి అత్యధికంగా వలస బాట పట్టారు. కోసిగిలోని కాశమ్మ గడ్డ, చింతలగేని వీధి, కడపాళెం, కింద మారెమ్మ దేవి, కోతి గేరి, నాగన్న గేరి, దుర్గిగేని, కొండుగానీ వీధి, రంగప్ప గట్టు, శ్రీచైతన్య స్కూల్ సమీపంలో, రామక్కమ్మ దేవాలయం, 1వ వార్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీప కాలనీలతో పాటు చింతకుంట, పల్లెపాడు, దుద్ది, కొల్మాన్‌పేట, ఆర్లబండ, కామన్‌దొడ్డి, చిర్తనకల్లు, సజ్జలగుడ్డం, వందగల్లు, జుమ్మాలదిన్నె గ్రామాల నుంచి సుగ్గికి వెళ్లారు. దీంతో ప్రజలు లేక ఆయా గ్రామాలు, కాలనీలు నిర్మానుష్యంగా మారాయి. నాగన్న గేరి, కాశమ్మ గడ్డ కాలనీల్లో ఎప్పుడు ప్రజలతో కళకళలాడేది. ప్రస్తుతం రోడ్లపై ప్రజలు కనిపించడం లేదు. వీరందరూ కర్ణాటక రాష్ట్రంలోని సేదాపురం, గబ్బూరు, మటమారి, మర్చటాల్, ఉట్కూరు, తదితర గ్రామాలు, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు తరలివెళ్లారు. వెళ్లిన చోట పొలాల్లో పత్తి తీయడం, రోజు వారీ కూలి పనులు చేసుకుంటున్నారు. కేజీ పత్తి తీస్తే రూ.12 చొప్పున కూలి ఇస్తుండడంతో ఉదయం నుంచి రాత్రి వరకు పొలాల్లో పిల్లలతో సహా పెద్దలు కష్టపడుతున్నారు. గ్రామాల్లో పనులు లేకపోవడంతో వలస వెళ్లక తప్పడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతూళ్లో ఉంటే భోజనానికి కష్టంగా మారి అప్పుల ఊబిలో ఉండి పోవాల్సి వస్తోందని వాపోయారు. వెళ్లి చోట పనులు చేసుకుని పొట్ట నింపుకునేందుకు కాసిన్ని డబ్బులు సమకూర్చుకుంటామని కూలీలు చెప్పారు.



పిల్లాపాపలతో వలస పోతున్న కూలీలు

ప్రారంభం కానీ ఉపాధి పనులు

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తామని అధికారికంగా చెబుతున్నా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏ గ్రామంలోనూ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అడిగిన వారందరికి పనులు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ కుటుంబానికి వంద రోజులు మాత్రమే అంటూ నిబంధనలు విధించడంతో ఒక కుటుంబంలో నలుగురు పనులు చేసుకుంటే నెలరోజులకు కూడా సరిపోవడం లేదని, పనులు చేసుకున్నా పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపోవడం లేదని కూలీలు పేర్కొంటున్నారు.



పాఠశాలలో తగ్గిన హాజరు శాతం

పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు పిల్లలను బడి మాన్పించి తమ వెంట తీసుకెళుతున్నారు. దీంతో మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పూర్తిగా తగ్గింది. ప్రధానంగా కోసిగిలోని హిందూ బాలికల ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 473 మంది చదువుతున్నారు. అయితే రెండు రోజులుగా పాఠశాలలో కేవలం 166 మంది మాత్రమే హాజరవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 356 మంది వరకు హాజరయ్యారు. తల్లి దండ్రులతో పాటు పిల్లలను తీసుకెళ్లడంతో అక్టోబర్ నెలలో సగానికి పైగా తగ్గిపోయారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెల వరకు పిల్లల హాజరు శాతం తక్కువగా ఉంటోంది.

● అదేవిధంగా కోసిగి చాకలగేరి, ఆదిఆంధ్ర, రంగప్పగట్టు, కుమ్మరి వీధి, జేబీఎం, ఎస్‌డబ్ల్యూ, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో హాజరు శాతం తగ్గిపోయింది. మండలంలోని దుద్ది, చింతకుంట, పల్లెపాడు, చిన్నభూంపల్లి, డి.బెళగల్, వందగల్లు, ఆర్లబండ గ్రామాల నుంచి అత్యధికంగా వలస వెళ్లారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు 15,287 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అధికారికంగా 432 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో వలస వెళ్లినట్లు చెబుతున్నారు. అయితే ఈ సంఖ్య వెయ్యికి పైగా ఉంది. ఏటా మండలం నుంచి అనేకమంది వలస వెళుతుండడంతో అక్షరాస్యత శాతం తగ్గిపోతోంది. రాష్ట్రంలోనే అక్షరాస్యత 34 శాతంతో కోసిగి మండలం అట్టడుగు స్థానంలో ఉన్నా ప్రభుత్వం, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పిల్లల భవిష్యత్ కోసం శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరుతున్నారు.



కోసిగి హిందూ బాలికల పాఠశాలలో 60 మందికిగానూ హాజరైన 20 మంది విద్యార్థులు

ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్నా



నా పేరు లక్ష్మయ్య, చింతకుంట గ్రామం. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు భార్య పిల్లలతో కలిసి పనుల కోసం కర్ణాటక ప్రాంతానికి వెళ్లారు. నాకు పనిచేతగాకపోవడంతో ఇంటి దగ్గర ఒంటరిగా ఉండిపోయాను. ఏటా ఇదే పరిస్థితి ఉంది. ఎవరైనా పెడితే తింటాను. లేకపోతే పస్తులు ఉండాల్సి వస్తోంది.

– లక్ష్మయ్య, చింతకుంట

పిల్లల హాజరు సగానికి పైగా తగ్గింది



మా పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 477 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దసరా సెలవుల అనంతరం సగానికి పైగా పిల్లలు బడికి రావడం లేదు. తల్లిదండ్రులను, మిగతా పిల్లలను విచారిస్తే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు చెబుతున్నారు. ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో విద్యార్థుల హాజరు తగ్గిపోతోంది. పెద్దలు తమ వెంట పిల్లలను కూడా తీసుకెళుతున్నారు. పిల్లలను బంధువుల వద్ద వదిలేసి వెళ్లండి, బడికి వచ్చి చదవుకుంటారని చెబుతున్నా వినడం లేదు. మా ప్రయత్నం చేస్తున్నాం.

– సంజన్న, హిందూ బాలికల పాఠశాల హెచ్‌ఎం, కోసిగి

క్లుప్తంగా

నామినీకి పరిహారం చెల్లించాల్సిందే

- ఐసీఐసీఐ బీమా సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): జీవిత బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి మరణించినందున నామినీకి సొమ్ము చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారుల కమిషన్ స్పష్టం చేసింది. వివరాలు.. నందికొట్కూరు ప్రాంతానికి చెందిన కాటిపోగు చిన్న నాగన్న 2021 మే 14న ఫోన్‌పే ద్వారా రూ.3500 ప్రీమియం చెల్లించి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ పాలసీ తీసుకున్నాడు. దురదృష్టవశాత్తు 2022 మార్చి 22న ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ పాలసీలో నామినీగా ఉన్న కుమారుడు శ్రీకాంత్ బీమా సొమ్ము చెల్లించాల్సిందిగా సంస్థను కోరాడు. పాలసీదారుడి వార్షిక ఆదాయం లక్ష రూపాయలపైనే ఉందని, దీంతో పాలసీ తీసుకోవడానికి అనర్హుడంటూ క్లెయిమ్‌ను సంస్థ తిరస్కరించింది. దీనిపై శ్రీకాంత్ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన తండ్రి వార్షికాదాయం రూ.1.44 లక్షలుగా పేర్కొంటూ ధ్రువపత్రాలు సమర్పించాడు. కేసు పరిశీలించిన కమిషన్.. వ్యక్తి ఆదాయాన్ని పరిశీలించిన తర్వాతే పాలసీ ఇవ్వాలా? వద్దా? అనేది నిర్ణయించుకోవాలని, పాలసీ జారీ చేసిన తర్వాత కారణాలు చూపి పరిహారం నిరాకరించడం సరికాదని స్పష్టం చేసింది. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, కోర్టు ఖర్చుల కింద మరో రూ.15 వేలు 45 రోజుల్లోపు చెల్లించాలని కమిషన్ ప్రెసిడెంట్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎస్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ తీర్పు చెప్పారు.

11 మంది ఏఎస్‌ఐలకు పదోన్నతి



డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన పదోన్నతి ఎస్‌ఐలు

కర్నూలు (టౌన్): రాయలసీమ రేంజ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు, సత్యసాయి జిల్లాకు చెందిన ఏడుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. మొత్తం 11 మందికి పదోన్నతులు కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారు డీఐజీని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పదోన్నతులు పొందిన వారంతా 1990 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన వారే. డీఐజీ మేనేజర్ విజయరాజు ఉన్నారు.

పోటీతత్వంతోనే సామర్థ్యం పెంపు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న అతిథులు

డోన్ టౌన్: విద్యార్థుల మధ్య పోటీతత్వం వల్ల సామర్థ్యం పెరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. వారు మంగళవారం పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ప్రశంసా పత్రాలు, మొమెంటోలను అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నప్పుడే వారిలోని సామర్థ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం డీసీఓ శ్రీదేవి మాట్లాడుతూ.. జోనల్ పరిధిలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తమంగా రాణించిన 26 స్కూళ్ల క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎంఈఓ రామనర్సప్ప, ప్రిన్సిపాల్ గీత పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

- ఆమె కుమారుడికి తీవ్రగాయాలు



మృతి చెందిన రమణమ్మ

కర్నూలు (టౌన్): నిర్లక్ష్యంగా వ్యాన్‌ను నడిపి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం, నెహ్రూనగర్‌కు చెందిన సిరిగిరి రమణమ్మ (57) కర్నూలు టెలికాం నగర్‌లో నివశిస్తున్న కుమారుడి వద్ద ఉంటోంది. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో కుమారుడితో బైక్‌పై నందికొట్కూరుకు బయలుదేరారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూర్ రోడ్డు వైపు వెళుతున్న వీరి బైక్‌ను స్థానిక చంద్రశేఖర్‌నగర్ నుంచి కర్నూలు టౌన్‌లోకి వస్తున్న అను మిల్క్ డైరీకి చెందిన వ్యాన్ (ఏపీ 39 యూకే 9348) ఢీకొట్టింది. కిందపడిన రమణమ్మపై వ్యాన్ వెళ్లడంతో తల, ఎడమ మోకాలికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. కుమారుడికి సైతం తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్‌లో క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్యాజువాలిటీలో చికిత్స చేసిన వైద్యులు 8 గంటల సమయంలో రమణమ్మ చనిపోయినట్లు వెల్లడించారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ వెల్లడించారు.

టైరు పేలి కారు బోల్తా

- దంపతులకు తీవ్ర గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద 44 వ నంబర్ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. అనంతపురం జిల్లా యాడికి పట్టణానికి చెందిన దంపతులు మహమ్మద్, రఫిక కర్నూలులో చదువుతున్న తమ కుమార్తెను చూసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పోతుదొడ్డి వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలింది. దీంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ఉన్న దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ సునీల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.



ప్రమాదానికి గురైన కారు

ఈ కారు కథ కంచికి చేరదా?

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ ఖరీదైన కారు ఏడాదిగా మూలన పడి వాడకానికి పనికి రాకుండా పోతోంది. కారును సీజ్ చేసిన అధికారితో పాటు మరో ముగ్గురు కూడా బదిలీ అయి వెళ్లిపోయారు. పోలీస్ స్టేషన్ కూడా అప్‌గ్రేడ్ అయ్యింది. అయినా కారు కథ కంచికి చేరడం లేదు.

దిక్కుమొక్కు లేక..

ఏడాది కిందట ఆత్మకూరు మండలం నల్లకాల్వ – బాపనంతాపురం మధ్య జంబులమ్మ ఆలయం వద్ద తెలుపు రంగు కియా కారు మూడు రోజులుగా ఉండడంతో అనుమానం కలిగిన స్థానికులు అప్పటి ఎస్‌ఐకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా కారుకు నంబర్ ప్లేట్ లేదు, విండో షీల్డ్స్ పగులగొట్టి ఉన్నాయి. ఛాసిస్ నంబరు ఆధారంగా కారు యజమానిని గుర్తించారు. కారు మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ కాగా యజమాని కర్ణాటక వ్యక్తిగా తేలింది. పోలీసులు అతనికి ఫోన్ చేసి కారును తీసుకెళ్లమని చెప్పగా ఇంతవరకు రాలేదు.



ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచిన కియా కారు

అసలు ఈ కియా కారు కథేంటి..

ఏడాది కిందట జాతీయ రహదారి – 44లో కారులో వెళుతున్న వ్యక్తులను కొందరు దుండగులు అటకాయించి బలవంతంగా అదే కారులో తీసుకెళ్లిపోయారు. ఓ చోట వారిని దింపేసి వెళ్లిపోయారు. దీనిపై బాధితులు డోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగులు తీసుకెళ్లిన కారు ఆత్మకూరు ప్రాంతంలో దొరికింది. అప్పటినుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌లోనే మగ్గుతోంది.

కారు హైజాక్ వెనుక హవాలా ముఠా?

పెద్ద మొత్తంలో హవాలా సొమ్ము చేతులు మారే సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ కేసుపై ఎవరైనా అడిగితే.. డోన్‌లో కిడ్నాప్ కేసు నమోదై ఉన్నందున వారికి హ్యాండోవర్ చేయాల్సి ఉందని, అయితే వారు పట్టించుకోవడం లేదని చెప్పి తప్పించుకుంటున్నారు.

కూతురిని పరీక్షకు తీసుకెళ్తూ తండ్రి దుర్మరణం

- కుమార్తె, కుమారుడు, డ్రైవర్‌కు గాయాలు
- ఎస్.లింగందిన్నె క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డు ప్రమాదం



ఎస్. లింగందిన్నె క్రాస్ రోడ్డు సమీపంలో కారును ఢీకొన్న లారీ



కుమ్మరి హేమాద్రి (ఫైల్)

గోనెగండ్ల: కుమార్తెను కర్నూలులో స్టాఫ్ సెలక్షన్ కమీషన్ పరీక్ష రాయించేందుకు తీసుకెళ్తుండగా ఎస్. లింగందిన్నె క్రాస్ రోడ్డు సమీపం పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కుమ్మరి హేమాద్రి (38) మృతి చెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. వివరాలు.. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన కుమ్మరి హేమాద్రి తన కూతురు త్రివేణిని ఉన్నత ఉద్యోగంలో చూడాలని కష్టపడి చదివించాడు. ఈ క్రమంలో కుమార్తెను స్టాఫ్ సెలక్షన్ కమీషన్ పరీక్ష రాయించేందుకు సోమవారం కొనకొండ్ల నుంచి బయలుదేరారు. పత్తికొండలోని స్నేహితుడి ఇంటికి వెళ్లి రాత్రి బస చేసి మంగళవారం ఉదయం స్నేహితుడి కారు (ఏపీ 21 సీఈ 8551)లో డ్రైవర్‌తో పాటు హేమాద్రి తన కూతురు, కుమారుడితో కర్నూలుకు బయలుదేరారు. ఎస్.లింగందిన్నె క్రాస్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద వెళుతుండగా హారన్ మోగించకుండా వేగంగా దూసుకొచ్చిన లారీ (టీఎస్ 12 ఈక్యూ 9558) వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ప్రమాదంలో హేమాద్రి తల, బుజానికి తీవ్రగాయాలయ్యాయి. కూతురు, కుమారుడు, డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. కోలుకోలేక హేమాద్రి మృతి చెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంగారం కోసమే ఆర్‌ఎంపీ హత్య

కొలిమిగుండ్ల: బెలుంకు చెందిన ఆర్‌ఎంపీ బెల్లాల కొండయ్యను బంగారం కోసమే హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం స్థానిక యూపీఎస్‌లో సీఐ రమేష్‌బాబు ఆర్‌ఎంపీ హత్య కేసు వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 25న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిన కొండయ్య తిరిగిరాలేదని భార్య వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. 26న బెలుం శింగవరం సమీపంలోని గాలేరు నగరి వరద కాల్వలో కొండయ్య మృతదేహం కొట్టుకు పోతుండంతో స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు, బెలుం గ్రామస్తులు అక్కడికి చేరుకుని సంజామల మండలం రామిరెడ్డిపల్లె సమీపంలో కాల్వ నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. తలకు గాయాలు ఉండటంతో ఎవరో హత్య చేసి కాల్వలో పడేశారని నిర్ధారణకు వచ్చారు.

బెలుం శింగవరంకు చెందిన ధనపాటి శ్రీనాథ్‌రెడ్డి అలియాస్ విశ్వనాథరెడ్డి తన తండ్రికి ఆరోగ్యం సరిగా లేదని చికిత్స చేయాలని ఫోన్ చేసి కోరడంతో ఆర్‌ఎంపీ కొండయ్య బైక్‌పై గాలేరు నగరి కాల్వ సమీపంలోని రాళ్ల గుట్టపై నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లాడు. అప్పటికే శ్రీనాథ్‌రెడ్డి, తల్లిదండ్రులు ఆనంద్‌రెడ్డి, మహేశ్వరమ్మ ఆర్‌ఎంపీ మెడలోని బంగారు గొలుసు, చేతికి ఉన్న ఉంగరాలను కొట్టేయాలని కుట్ర పన్నారు. ఇంజెక్షన్ వేసేందుకు ఏర్పాటు చేసే సమయంలో తలపై ఇనుపరాడ్లతో దాడి చేయడంతో కొండయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత రెండున్నర తులాల బంగారు వస్తువులు తీసుకొని ఆర్‌ఎంపీ బైక్, సెల్‌ఫోన్‌ను కాల్వలో పడేశారు. అనుమానాస్పదంగా కనిపించిన శ్రీనాథ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో తల్లిదండ్రులతో కలిసి బంగారం కోసమే హత్య చేసినట్లు అంగీకరించాడు. బంగారు వస్తువులను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల(సిటీ): స్థానిక రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి మంగళవారం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ ఫరూఖ్ (36) సలీం నగర్‌లో నివాసం ఉంటున్నాడు. రైలు ఫ్లాట్‌ఫారం మీద ఆగడానికి వస్తున్న సమయంలో ఫరూక్ ఒక్కసారిగా పట్టాలపైకి దూకాడు. క్షణాల్లో రైలు అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య సప్రున్నిసా ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మద్యం మత్తులో విద్యార్థి బడికి..

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మున్సిపల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి మద్యం తాగి పాఠశాలకు వచ్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం స్కూలులో మద్యం మత్తులో ఉన్న విద్యార్థిని ఉపాధ్యాయులు గుర్తించి ఓ గదిలో ఉంచి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనపై తోటి విద్యార్థుల వద్ద ఆరాతీయగా విద్యార్థి బర్త్ డే కావడంతో మద్యం తాగినట్లు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకోవడంతో ఉపాధ్యాయులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలన్నారు. పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నాం, మా బాధ్యత తీరిపోయింది అని గాకుండా పిల్లల ప్రవర్తను గమనిస్తూ ఉండాలని సూచించారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు



సుధాకర్ (ఫైల్)

మహానంది: తెలుగుగంగ కాల్వలో గల్లంతైన యువకుడు సుధాకర్ (25) కోసం గాలిస్తున్నట్లు మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన సుధాకర్ గత ఆదివారం మిత్రులతో కలిసి గాజులపల్లె సమీపంలోని బసవాపురం వద్దకు వచ్చాడు. అక్కడ కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు తెలుగుగంగ కాల్వలోకి దిగిన సుధాకర్ ప్రమాదవశాత్తు జారిపడి కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. రుద్రవరం వరకు కాలువ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా సుధాకర్ గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

యురేనియం తవ్వకాలపై ఆందోళన వద్దు

- జిల్లా అటవీ శాఖ అధికారి పి.శ్యామల



కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం

కర్నూలు కల్చరల్: కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో యురేనియం తవ్వకాల విషయంపై ఆయా గ్రామాలు ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లా అటవీ శాఖ అధికారి పి.శ్యామల సూచించారు. భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2017 జూన్ 23, అక్టోబర్ 3 తేదీల్లో కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో యురేనియం, సంబంధిత అటామిక్ మినరల్స్ పరిశోధన కోసం 20 బోర్లు వేసేందుకు అనుమతి ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఆ మేరకు బోర్లు వేసి మట్టి నమూనాలు సేకరించినట్లు చెప్పారు. తర్వాత ప్రభుత్వం, పర్యావరణ, అటవీ శాఖ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారు జూన్ 26న ఫారెస్ట్‌లో 468.25 హెక్టార్ల విస్తీర్ణంలో యురేనియం ఖనిజం అంచనా కోసం 68 బోర్లు తవ్వి మట్టి నమూనాల సేకరణకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. యురేనియం ఖనిజ నిక్షేపాలు వెలికితీసేందుకు కాదని స్పష్టంచేశారు. ఈ విషయమై ఈ నెల 28న అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ రీజినల్ డైరెక్టర్ ఏఆర్ ముకుందన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి ప్రాజెక్టు వివరాలను వివరించామన్నారు. ప్రాజెక్టు విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.